

## 15న ఆశీల వసూళ్లకు వేలం

**శ్రీకాకుళం అర్బన్ :** నగరపాలక సంస్థ పరిధిలోని మార్కెట్, రోడ్ మార్జిన్స్‌లో 2023-24 సంవత్సరానికి ఆశీలు వసూలు చేసుకునేందుకు ఈనెల 15న ఏజెన్సీ ఎంపికను బహిరంగ వేలం ద్వారా చేపట్టనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కౌన్సిల్ హాల్‌లో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.పది లక్షల సాల్వెన్సీ, రూ.మూడు లక్షల డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనే హెచ్చుపాటదారునికి నగరంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్‌తో పాటు రైతుబజారు, ఇతర రోడ్ మార్జిన్ ప్రాంతాల్లో, ఏడు విలీన గ్రామ పంచాయతీల పరిధిలో ఆశీలు వసూలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆశీల వసూలుకు అనుమతిస్తామని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న పాటదారులు ఇతర వివరాలకు కార్యాలయ పనివేళల్లో రెవెన్యూ విభాగాన్ని సంప్రదించాలని సూచించారు.

# గర్భిణులను వేధిస్తున్న రక్తహీనత

- 80శాతం మందిలో మైల్డ్ ఎనీమియా
- జాగ్రత్తలు తీసుకోకుంటే ఇబ్బందులు
- పోషకాహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం వల్లే...

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఐరన్ లోపంతో బాధపడుతున్న గర్భిణుల సంఖ్య పెరుగుతోంది. ఫలితంగా ప్రసవ సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదీ పలువురు గైనకాలజీ వైద్య నిపుణులు చెప్తున్న మాట. ఐరన్ లోపంతో బాధపడే గర్భిణులను సివియర్ ఎనీమియా, మైల్డ్ ఎనీమియాగా పిలుస్తారు. సాధారణంగా 80 శాతం గర్భిణులు మైల్డ్ ఎనీమియాతో బాధపడుతున్నట్టుగా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. శ్రీకాకుళం నగర పరిధిలోని రిమ్స్ ఆస్పత్రిలో ప్రతినెలా సుమారు 200 నుంచి 300 వరకు ప్రసవాలు చేస్తుంటారు. వీరిలో సుమారు 180 మంది గర్భిణులు మైల్డ్ ఎనీమియాతో బాధపడుతున్నట్టుగా చెప్తున్నారు. ప్రసవ వేదన మొదలవగానే ముందుగా వైద్యులు వారి కుటుంబ సభ్యులకు రక్తం యూనిట్లు సిద్ధం చేసుకోవాలని చెప్తుంటారు. మరో 15 శాతం మందిలో మాత్రమే సాధారణ స్థాయి కంటే అధికంగా హిమోగ్లోబిన్ ఉంటోంది. మరో ఐదు శాతం మంది సివియర్ ఎనీమియాతో బాధపడుతున్నట్టు నిర్ధారించారు.

### రక్తహీనత నిర్ధారించేది ఇలా...

హిమోగ్లోబిన్ పరీక్ష నిర్వహించడం ద్వారా రక్తహీనతను నిర్ధారిస్తారు. హిమోగ్లోబిన్ 11 గ్రాములు ఉంటే సమస్య లేనట్టు. అంతకంటే తక్కువగా ఉంటే రక్తహీనతతో బాధపడుతున్నట్టే. సివియర్ ఎనీమియాతో బాధపడే గర్భిణుల్లో ఏడు గ్రాములు కంటే తక్కువగా హిమోగ్లోబిన్ ఉంటోంది. ఇది అత్యంత ఇబ్బందికరమైనది. ఈ సమస్య ఎక్కువగా ఏజెన్సీ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన గర్భిణుల్లో కనిపిస్తోందని వైద్యులు పేర్కొంటున్నారు. ఏడు నుంచి తొమ్మిది గ్రాముల మధ్య 80 శాతం మంది గర్భిణుల్లో ఉంటోంది. దీన్ని మైల్డ్ ఎనీమియాగా చెప్తున్నారు. గర్భం దాల్చిన తర్వాత తగిన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల మైల్డ్ ఎనీమియాలో ఉన్న ఎనీమియా స్థాయికి గర్భిణులు చేరుతున్నారు.

### ఇదీ ప్రధాన కారణం

రక్తహీనత బారిన పడడానికి ప్రధాన కారణం పోషకాహార లోపంగా చెప్తున్నారు. ఎక్కువ మందిలో ఐరన్ లోపం కనిపిస్తోంది. ఎ, బి12, బి2, సి, డి, విటమిన్లు, రాగి, జింక్ వంటి లోపం వల్ల రక్తహీనత బారిన పడుతున్నారు. రక్తహీనతతో బాధపడే గర్భిణుల్లో తీవ్రమైన అలసట, కళ్లు పాలిపోవడం, ఆయాసం, గుండె దడ వంటి లక్షణాలు కనిపిస్తాయి.



### ఇవీ సమస్యలు..

పుట్టబోయే బిడ్డ బరువు, పెరుగుదల తక్కువగా ఉంటుంది. హిమోగ్లోబిన్ ఏడు గ్రాముల కంటే తక్కువగా ఉన్న గర్భిణులకు ప్రసవ సమయంలో హార్ట్ ల్యూర్ కొన్నిసార్లు మరణానికి కారణమవుతున్నాయి. ప్రసవ మరణాల్లో ఇన్ డైరెక్ట్ కారణాల్లో ఇదొకటని నిపుణులు చెప్తున్నారు. రాష్ట్రంలోని ప్రతి లక్ష ప్రసవాల్లో 54 మంది ఇలా మృత్యువాత పడుతున్నారు. జిల్లాలో ఈ రేషియో ఇంకా ఎక్కువే.

### ఆ వయసు కీలకం

గర్భిణుల్లో రక్తహీనత సమస్యను పరిష్కరించేందుకు ముందస్తు చర్యలే మార్గమని చెప్తున్నారు. ముఖ్యంగా, 10-19 ఏళ్ల లోపు వయసున్న బాలికల్లో రక్తహీనతను నిర్ధారించే పరీక్షలు చేయాలి. అవసరమైన పోషకాహారం, మందులు అందించడం వల్ల కోలుకుంటున్నారని, వివాహ సమయానికి సమస్యకు శాశ్వతంగా చెక్ చెప్పవచ్చని వైద్య నిపుణులు చెప్తున్నారు.

### పోషకాహారంతో మేలు

పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యకు చెక్ చెప్పవచ్చు. ప్రతిరోజూ ఆహారంలో ఆకుకూరలు, మాంసం, డ్రైఫ్రూట్స్, పళ్లు తీసుకోవాలి. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన మహిళలు బెల్లంచిక్కీలు వంటివి రోజూ తీసుకోవడం ద్వారా రక్తహీనతకు గురికారని వైద్యులు చెప్తున్నారు. చాలామందికి పోషకాహారం తీసుకునేందుకు అవకాశమున్నా, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ సమస్య ఎదురవుతోందని చెప్తున్నారు.

### ముందు నుంచే జాగ్రత్తలు అవసరం

గర్భిణుల్లో రక్తహీనతతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. పోషకాహారం తీసుకోకపోవడం, చిన్న వయసులోనే పెళ్లిళ్ల వల్ల ఈ సమస్య పెరుగుతోంది. ప్రతి ఐదుగురు గర్భిణుల్లో ముగ్గురు రక్తహీనతతో బాధపడుతున్న వారు ఉంటున్నారు. వీరికి తగిన మందులతోపాటు డైట్ ప్లాన్ చెప్తున్నాం. ప్రసవ సమయంలో క్లిష్ట పరిస్థితులు ఎదురవకుండా అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలి.

**- డాక్టర్ సంపతిరావు శ్రీదేవి , గైనకాలజిస్ట్**

### ఎదిగే వయసులో గర్భం దాల్చడం వల్ల సమస్య



రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల సంఖ్య అధికంగానే ఉంటోంది. గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చే వారికి అవసరమైన ఐరన్ ఇంజెక్షన్లు, రక్తం ఇస్తాం. ఎదిగే వయసులో పెళ్లిళ్లు, చిన్న వయసులోనే గర్భం దాల్చడం వల్ల సమస్య అధికమవుతోంది. పీరియడ్స్ సమయంలో హెవీ బ్లీడింగ్ కావడం, అందుకు అనుగుణంగా పోషకాహారం తీసుకోకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతోంది. 10-19 ఏళ్లలో పాఠశాల, కళాశాలల పిల్లలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించడం వల్ల సమస్యకు శాశ్వతంగా పరిష్కారం చూపించేందుకు అవకాశం ఉంది.

**- డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి,**
**సీనియర్ గైనకాలజిస్టు, డిఎంహెచ్ఒ**





సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్ర

## 13 నుంచి పోస్టుకార్డు ఉద్యమం

### ఆర్థిక సంబంధ బకాయిలు చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థికపరమైన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఈనెల 13 నుంచి మార్చి ఐదో తేదీ వరకు పోస్టుకార్డు ఉద్యమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పి.అప్పారావు, ఎస్.కిశోర్ కుమార్ తెలిపారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆఫీస్ బ్యారర్ల సమావేశంలో వారు మాట్లాడారు. పెండింగ్‌లో ఉండే డిఎను వెంటనే విడుదల చేయాలన్నారు. సిపిఎస్ ఉద్యోగుల గత డిఎ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పిఎఫ్ ఎపిజిఎల్ఐ రూ.మూడు వేల కోట్ల బకాయిలను చెల్లించాలని, సరెండర్ లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ మొత్తాన్ని చెల్లించాలన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీకి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక సంబంధమైన బకాయిలను చెల్లించడంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జోక్యం చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకే పోస్టుకార్డు ఉద్యమం చేపడుతున్నట్లు చెప్పారు.

వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో దూరప్రాంతాలకు సర్దుబాటు చేసిన వారికి, వైద్య కారణాలతో బాధపడుతున్న వారికి, ఉద్యోగ విరమణకు సమీపంలో ఉన్న వారికి మినహాయింపు ఇవ్వాలన్నారు. వంద నుంచి 200 కిలోమీటర్ల దూరంలో సర్దుబాటు చేయడం అన్యాయమన్నారు. దీన్ని వెంటనే సరిచేయాలని కోరారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేయడం సరికాదన్నారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎల్.బాబూరావు, కోశాధికారి బి.శ్రీరామ్మూర్తి, జిల్లా కార్యదర్శి కె.రమేష్ కుమార్, ఎం.వి రమణ, పి.సూర్యప్రకాశరావు, ఆర్.పరమేశ్వరరావు, జి.మాధవరావు, ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోటెత్తిన యాత్రికులు



**పొందూరు :** దల్లవలస రాజమ్మతల్లి దర్శనానికి యాత్రికులు పోటెత్తారు. రెండేళ్లకోసారి రెండు రోజుల పాటు నిర్వహించే రాజమ్మతల్లి జాతర ఆదివారంతో ముగిసింది. జాతరకు జిల్లా నలుమూలలు నుంచే ఉమ్మడి విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల నుంచే ఒడిశా, తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చారు. రెండు రోజుల్లో యాత్రికులు పెద్దసంఖ్యలో రావడంతో దర్శనానికి గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. దీంతో వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లలు ఇబ్బందులు పడ్డారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఒకటో డిపో మేనేజర్ మాధవ్

## శివరాత్రికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని శ్రీకాకుళం నుంచి వేర్వేరు ప్రాంతాలకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ మాధవ్ తెలిపారు. నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో గల స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 18, 19 తేదీల్లో శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల నుంచి 30 ప్రత్యేక బస్సులు రణస్థలం-రామతీర్థాల మధ్య ఏర్పాటు చేశామని చెప్పారు. 17న ఉదయం పది గంటలకు శ్రీశైలంకు, 18న శివరాత్రిని పురస్కరించుకుని వత్సవలస, శ్రీముఖలింగం క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రణస్థలం - రామతీర్థాల మధ్య రూ.30 ఛార్జీగా నిర్ణయించామన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అసమ్మతి నాయకులను సస్పెన్షన్ చేయాలి

### పలాస వైసిపి నాయకుల తీర్మానం

ప్రజాశక్తి - పలాస

వైసిపిలో కీలక పదవులను అనుభవిస్తూ రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పార్టీకి నష్టం కలిగిస్తున్న అసమ్మతి నాయకులను సస్పెండ్ చేయాలని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైసిపి కౌన్సిలర్లు, నాయకులు పార్టీ అధిష్టానాన్ని కోరారు. మంత్రి అప్పలరాజు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దువ్వాడ శ్రీకాంత్, జుత్తు నీలకంఠం, దువ్వాడ హేంబాబు చౌదరి మాట్లాడుతూ వైసిపిలో ఉంటూ ప్రతిపక్ష నాయకులతో చేతులు కలిపి పార్టీకి ద్రోహం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. వైసిపి పట్టణాధ్యక్షుడు దువ్వాడ శ్రీకాంత్ మున్సిపల్ ఎన్నికల తర్వాత పార్టీ కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో ఆయన సత్తా ఏమిటో తెలిసిపోతుందన్నారు. ఉజ్జిడిమెట్ట, కంబిరిగాం, పెంటిభద్ర, గోల్డెన్ భూముల్లో ఎవరు అవినీతికి పాల్పడ్డారో అందరికీ తెలుసునన్నారు. కీర్తిశేషులు మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు కాంగ్రెస్ పార్టీలో ఉంటే, ఆయన సోదరుడు జుత్తు నీలకంఠం టిడిపి తీర్థం పుచ్చుకున్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం వైసిపిలో ఉంటూ పార్టీకి నష్టం కలిగించే చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అనంతరం పార్టీకి నష్టం చేకూరుస్తున్న అసమ్మతి గ్రూపు నాయకులను సస్పెండ్ చేయాలని తీర్మానం చేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, బి.కృష్ణారావు, ఎఎంసి చైర్మన్ పి.వి సతీష్, మున్సిపల్ విప్ దుర్గాశంకర్ పండా, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, పలాస ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డి.భవానీ శంకర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



తీర్మానం కాపీని చూపిస్తున్న గిరిబాబు, వైసిపి నాయకులు

## ఆదివాసీల హక్కులు కాలరాత

ప్రజాశక్తి - పలాస

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల హక్కులను కాలరాస్తున్నాయని మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు హెచ్.ఆర్ జగన్నాథం విమర్శించారు. బొడ్డపాడు యువజన సంఘం 69వ వార్షికోత్సవాన్ని మండలంలోని బొడ్డపాడులో ఆదివారం నిర్వహించారు. గ్రామ వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి విప్లవ స్థూపాలు, అమరవీరుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్మిక పతాకాన్ని అమరవీరుల బంధుమిత్రుల సంఘం నాయకులు మడ్డు ధనలక్ష్మి, యువజన సంఘం పతకాన్ని బొడ్డపాడు యువజన సంఘం అధ్యక్షులు టి.క్రాంతికుమార్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో జగన్నాథం మాట్లాడుతూ హక్కులపై ప్రశ్నిస్తుంటే, శత్రుదేశంపై దాడులు చేసినట్లు గిరిజనులపై దాడులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజల సమస్యలపై యువజన సంఘాలు ఎల్లవేళలా పోరాటం చేస్తూనే ఉంటాయన్నారు. దేశంలో పోరాటాలకు శ్రీకాకుళం రైతాంగ పోరాటం దిక్సూచిగా నిలుస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం హైదరాబాద్ అరుణోదయ విమలక్క బృందంతో సిక్కోలు జానపద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ టి.త్రిలోచనరావు, రైతు కూలీ సంఘం నాయకులు తాండ్ర ప్రకాష్, పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షులు కృష్ణమూర్తి, దాసరి శ్రీరాములు, కె.ఢిల్లీరావు, జి.దశరథరావు, టి.గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



## అరసవల్లికి పెరిగిన రద్దీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాఘమాసం ఆదివారం కావడంతో అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి రద్దీ పెరిగింది. ఒకవైపు అరసవల్లికి రద్దీ పెరగడంతో పాటు గార మండలం వత్సవలసలో రాజరాజేశ్వరి ఉత్సవాలు కావడంతో భారీగా ఆదాయం సమకూరింది. టిక్కెట్ల ద్వారా రూ.9,73,800, విరాళాల రూపంలో రూ.1,82,000, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3.10 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు.

అరసవల్లి ఆలయాన్ని శాసనమండలి సభ్యులు తోట త్రిమూర్తులు కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. అనంతరం అనివెట్టి మండపంలో జ్ఞాపికను అందజేసి, స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



ఆదిత్యుని చిత్రపటాన్ని అందజేస్తున్న ఇఒ హరి సూర్యప్రకాష్

## రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

### వృద్ధురాలికి గాయాలు

ప్రజాశక్తి - రణస్థలం

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి చెందిన ఘటన రణస్థలం జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కోటపాలెం గ్రామానికి చెందిన కరగాన ఢిల్లేశ్వరి(7) తాత, అమ్మమ్మతో కలిసి వేల్పురాయి వెళ్లింది. తిరిగి కోటపాలెం వెళ్లేందుకు రామతీర్థాలు కూడలి వద్ద ఆటో ఎక్కింది. ఇంతలో విశాఖ నుంచి శ్రీకాకుళం వస్తున్న కారు రామతీర్థాలు కూడలి వద్ద వాహన వేగం తగ్గించడానికి బ్రేకు నొక్కబోయి ఎక్స్‌లేటర్ నొక్కడంతో కారు వేగం పెరిగి ఆటోను వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఢిల్లేశ్వరికి గాయాలై, షాక్‌లోకి వెళ్లింది. వృద్ధురాలి తలకు గాయమైంది. వెంటనే బాలికను కొండములగాం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు కుటుంబసభ్యులు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి బాలిక మృతిచెందింది. ఎస్ఐ రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఢిల్లేశ్వరి మృతదేహం

## ప్రాధాన్యతా పనులపై ప్రత్యేక శ్రద్ధ

- పరిశుభ్ర గ్రామాలే లక్ష్యం
- జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పన
- జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పంచాయతీరాజ్ వ్యవస్థలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం అవసరమని, వారి సహకారంతో గ్రామాల అభివృద్ధి సాధ్యమని జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట్రామన్ తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ప్రాధాన్యతా పనులపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. ఇ-గ్రామ స్వరాజ్యం పోర్టల్‌లో చేస్తున్న పనులు అప్‌డేట్ చేస్తున్నట్లు తెలిపారు. పలు అంశాలపై ఆయన 'ప్రజాశక్తి'లో వెల్లడించారు.

**జిల్లాలో కన్వర్జెన్సీ పనులు పూర్తి చేయడానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?**

జిల్లాలో ఉపాధి హామీ సమర్థవంతంగా అమలవుతోంది. దీని కింద అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ఈ ఏడాది 50 లక్షల పనిదినాలు లక్ష్యంగా పనులు చేపట్టనున్నాం. గ్రామాల్లో పనులు గుర్తించడం మొదలు నాణ్యమైన పనులు చేపట్టడం లక్ష్యంగా ముందుకెళ్లాలి. ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలి. గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మిస్తున్నాం. గ్రామ సచివాలయ భవనాలు, ఆర్‌బికెలు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీటిని త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే కొన్నిచోట్ల పనులు పూర్తయి భవనాలు అందుబాటులోకి వచ్చాయి. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

**15వ ఆర్థిక సంఘం నిధులను ఏవిధంగా వినియోగిస్తున్నారు?**

రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో ఉన్న ప్రియా సాఫ్ట్‌వేర్‌కు బదులు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా దేశవ్యాప్తంగా ఒకే విధానాన్ని అమలు చేయడమవుతోంది. అందువల్ల ఈ-గ్రామ స్వరాజ్యం పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ఈ-ప్రొఫైల్‌ను కొత్తగా మార్పు చేయడం వల్ల మొదట్లో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తినా, ప్రస్తుతం సమర్థవంతంగా ఈ-గ్రామ స్వరాజ్యం పోర్టల్‌ను వినియోగిస్తున్నాం. గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులు వినియోగించుకునేందుకు గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సంయుక్త బ్యాంకు ఖాతా ద్వారా కార్యకలాపాలు సాగించడం జరుగుతోంది.

**జగనన్న కాలనీల నిర్మాణాల వేగవంతానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?**

జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశాలను అనుసరించి జిల్లాస్థాయిలో ఎప్పటికప్పుడు మోనటరింగ్ చేయడంతో పాటు ప్రతి వారం పనుల పురోగతిని సమీక్షిస్తున్నాం. పనుల్లో వేగం పెంచడానికి అవసరమైన అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం.

**జగనన్న స్వచ్ఛ సంకల్పం అమలు ఎలా సాగుతోంది?**

జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యకలాపాలు ఆపకుండా నిరంతరం కొనసాగించాల్సి ఉంటుంది. ఎండ్ టు ఎండ్ పొందడానికి 632 గ్రామ పంచాయతీల షెడ్‌లను పూర్తి చేయాల్సి ఉంది. స్థలాలు సిద్ధంగా ఉన్న గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి నిధులను ఇస్తున్నాం. పరిశుభ్ర గ్రామాల సాధనగా కృషి జరగాలి. అన్ని పంచాయతీల్లో జగనన్న స్వచ్ఛ సంకల్పం చిత్తశుద్ధితో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికార్లతో పాటు ఎంపిడిఒలు, ఎంసిఆర్‌డిలు సమన్వయంతో క్షేత్రస్థాయి పరిశీలన చేపడుతున్నాం. చెత్త సేకరణతో పాటు తడి, పొడి చెత్తను విభజించి షెడ్లలో వాటిని ఆదాయ వనరులుగా మార్చడానికి చర్యలు చేపడుతున్నాం. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిందించాం. క్షేత్రస్థాయిలో ప్రజలు సహకరిస్తే అది శతశాతం అమలవుతుంది. ఆ దిశగా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.







**గ్రామ సచివాలయాల్లో సేవల మెరుగుదలకు ఏం చర్యలు చేపడుతున్నారు?**

గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటైన తర్వాత ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత దగ్గరయ్యాయి. సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుని ఇంటికే అందిస్తున్నాం. ప్రజలకు ఏ చిన్న సమస్య ఎదురైనా సచివాలయం స్థాయిలో పరిష్కరించుకునేందుకు వీలుంది. అక్కడ ఉద్యోగులు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారు. ఎక్కడైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే తక్షణమే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. ఆ సమయంలో నిర్లక్ష్యంగా ఉన్న ఉద్యోగులపై చర్యలు చేపడుతున్నాం. ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

**పారిశుధ్య నిర్వహణ మెరుగుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?**

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగుపరచడంలో భాగంగా చెత్త సేకరణపై దృష్టిసారించాం. మండల స్థాయిలో ఎంపిడిఒలకు ఇప్పటికే పారిశుధ్య నిర్వహణకు అనేక సూచనలు చేశాం. జిల్లాలో ఫేజ్-1, 2 కింద 76 గ్రామాలను ఎంపిక చేసి పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతున్నాం. శతశాతం ఒడిఎఫ్ సాధించడానికి కృషి చేస్తున్నాం.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

## సమస్యల పరిష్కారంలో ముందంజ
### ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ

**ప్రజాశక్తి - పొందూరు**

విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలపై పోరాటానికి ఎపిటిఎఫ్ ఎప్పుడూ ముందువరుసలో ఉంటుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. మండలంలోని తోలాపి గ్రామంలో ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు దుంపల సన్యాసి అప్పారావు సంతాప సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘువర్మ మాట్లాడుతూ ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ఉపాధ్యాయులు, ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా ఉందని అన్నారు. విద్యారంగ సమస్యలపై అప్పారావు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు భానుమూర్తి, ఎం.మదన్‌మోహన్, దవళ సరస్వతి, అనిల్, కె.విజయకుమార్, డి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## కూచిపూడి కోర్సుల్లో ప్రథమ స్థానం

**ప్రజాశక్తి - ఇచ్ఛాపురం**


విద్యార్థులతో చిన్న గురుస్వామి, జయలక్ష్మి

కూచిపూడి డిప్లమా(సర్టిఫికెట్) కోర్సుల్లో ఇచ్ఛాపురానికి చెందిన శ్రీ వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారులు ప్రథమ స్థానం సాధించారు. 2022 జూన్‌లో విజయనగరం శ్రీ మహారాజ మ్యూజిక్ కాలేజ్‌లో నిర్వహించిన కూచిపూడి నత్యానికి సంబంధించి నాట్య గురువు ఏలేశ్వరం శ్రీనివాసు కూచిపూడి గ్రామం కష్ణా జిల్లా వాస్తవ్యులు ఆధ్వర్యంలో జరిగిన డిప్లమా కోర్సులు నిర్వహించారు. కూచిపూడిలో నాట్య గురువు శృతి పట్నాయక్ మొదటి స్థానంలో ఉత్తీర్ణత సాధించింది. ఈ కోర్సులో ఎస్.పూజ, కె.జాగృతి, జాహ్నవిదేవీ మొదటి స్థానంలో ఉత్తీర్ణులయ్యారు. డాన్స్ మాస్టర్ వై.శ్రీనివాసులు మాస్టర్ చేతుల మీదుగా ఈ సర్టిఫికెట్లు అందజేశారు .అకాడమీ వ్యవస్థాపకులు చిన్న గురుస్వామి, జయలక్ష్మి దంపతులు చిన్నారులకు అభినందనలు తెలిపారు.

## అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఉదారత

**ప్రజాశక్తి - కవిటి**


ఆర్థికసాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

మండలంలోని బి.గొనపపుట్టుగ గ్రామానికి చెందిన క్షతగాత్రునికి అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆర్థికంగా అండగా నిలిచి తన ఉదారతను చాటుకుంది. గ్రామానికి చెందిన మల్లార్పు మోహనరావు రైలు ప్రమాదంలో తన రెండు కాళ్లు పోగొట్టుకుని దయనీయ పరిస్థితిలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు ఆదివారం బి గొనపపుట్టుగ గ్రామానికి చేరుకుని మోహనరావుకు రూ.10 వేలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతలు ఉదారంగ స్పందించి మోహనరావును ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్రి ప్రకాష్, అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు జి.జానకిరావు, జ్యోతి, భాస్కరరావు, సుందరరావు, సోమేశ్వరరావు, సొంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయం సందర్శన

**ప్రజాశక్తి - కొత్తూరు**


ఆలయ కమిటీతో మాట్లాడుతున్న తేజేశ్వరరావు

మండలంలోని గురండి గ్రామంలో ఉన్న భ్రమరాంబిక మల్లిఖార్జున స్వామి ఆలయం 9వ వార్షికోత్సవం సందర్భంగా దేవాలయ కమిటీ అహ్వానం మేరకు ప్రముఖ పారిశ్రామికవేత్త పాతపట్నం నియోజకవర్గ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు ఆదివారం దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ పూజారులు ప్రతేక్య పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో. సర్పంచ్‌లు బోర సింహాద్రినాయుడు, పడాల షణ్ముఖరావు, జి.వాసుదేవనాయుడు, మజ్జి అరవిందు, లింగాల వెంకటరావు, ఎన్.నాగేశ్వరరావు, పడాల రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు వాహనాల వేలం

**ప్రజాశక్తి - టెక్కలి రూరల్**


ఎస్ఐ రామకృష్ణ

టెక్కలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన ఒక టాటా మ్యాజిక్, నాలుగు మోటార్ సైకిల్స్‌ను సోమవారం బహిరంగంగా వేలం వేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. ఆసక్తిగల వారు మంగళవారం ఉదయం 10గంటలకు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే వేలంలో పాల్గొనాలని కోరారు.

## వంతెన పనులు పరిశీలన

**ప్రజాశక్తి - కొత్తూరు**


పనులను పరిశీలిస్తున్న సాగర్

మండలంలోని మాతల మాకవరం మధ్యలో లో లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఇటీవల ఎంపీ కింజరాపు.రామ్మోహన్‌నాయుడు ఎంపీ లాడ్స్ నుంచి రూ.23 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో చేపట్టిన పనులను టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్‌బాబు ఆదివారం పరిశీలించారు. ఆయన వెంట టిడిపి కార్యకర్తలు భీమారావు, తదితరులు ఉన్నారు.

## పెద్దలక్ష్మీపురంలో అన్నదానం

**ప్రజాశక్తి - మెళియాపుట్టి**



మండలంలో పెద్ద లక్ష్మీపురం గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా పురోహితులు డి.బాబూరావు గణపతి పూజ, హోమం చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదానానికి భారీగా యాత్రికులు వచ్చారు.

### ముగిసిన అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

**పొందూరు:** మండల కేంద్రంలో అయ్యప్పస్వామి సహిత పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ అష్టమ వారికోత్సవం ఆదివారంతో ముగిసింది. ఆలయ ప్రధాన అర్చకులు గిరిశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో వేలాది మంది పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో ఎమ్మెల్యే అశోక్

**ప్రజాశక్తి - ఇచ్ఛాపురం**


నూతన వధూవరులతో ఎమ్మెల్యే అశోక్

మండలంలో ఆదివారం జరిగిన పలు వివాహ, శుభ కార్యాక్రమాల్లో ఎమ్మెల్యే బెందాళం అశోక్ పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. మండలంలోని కొత్త శాసనాంలో పెదిని బాబ్జిరెడ్డి, ఇచ్ఛాపురంలోని కొరాయి ధర్మా యాదవ్, పరపటి కోటేశ్వరరావు, దక్కత కృష్ణమూర్తిరెడ్డి ఇళ్లలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అలాగే కంచిలి, సోంపేటలో నిర్వహించిన పలు వివాహాలకు హాజరయ్యారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు ఉన్నారు.

# కొబ్బరి కార్మికుల సమస్యలు పట్టవా?

**ప్రజాశక్తి - కంచిలి**

కార్మికుల సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నామని అటు పాలకులు, ఇటు అధికారులు ప్రకటనలు ఊదరగొడుతున్నారే తప్ప ఆచరణలో కార్మికుల సమస్యలు పట్టించుకునే నాథుడే లేరన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు కొబ్బరి వ్యాపారానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన కంచిలి కొబ్బరి మార్కెట్ పాలకుల తోడ్పాటు లేక, మార్కెట్‌పై వేరే ప్రాంతాల వారి ఆధిపత్యంతో కుదేలైంది. దీంతో వ్యాపారాభివృద్ధి సంగతి అటుంచితే నేడు కొబ్బరి కార్మికులకు కనీస అవసరాలు సైతం తీరే అవకాశాలు లేక వారంతా కుటుంబాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను అనుభవించేలా తగు చర్యలు తీసుకోవాలని సర్వత్రా కోరుతున్నారు.

కొబ్బరి పంట అంటే ముందుగా గుర్తుకొచ్చేది ఉద్దానం ప్రాంతం, అందులోనూ కొబ్బరి వ్యాపారం అంటే టక్కున గుర్తొచ్చేది కంచిలి గ్రామం. అంతగా కొబ్బరి వ్యాపారానికి పేరు గాంచింది. ఇదందుకుగాను కొబ్బరి బడ్డీలు, టోకు వర్తకుల హడావుడి, నిత్యం ఎగుమతులు, దిగుమతులు చేస్తు రాకపోకలు సాగించే కొబ్బరి లారీలతో కంచిలి మండలం కేంద్రం కళకళలాడుతూ ఉండేది. అయితే ఉద్దానాన్ని పలకరించిన ప్రకృతి వైపరీత్యంతో కొబ్బరి పంట నాశనం కావడంతో కంచిలి కొబ్బరి మార్కెట్ సైతం నేడు కళావిహీనంగా మారింది. ఏళ్ల తరబడి కొబ్బరి బడ్డీలను, కొబ్బరి పనులను నమ్ముకుని జీవనం సాగిస్తున్న కొబ్బరి కార్మికులు మాత్రం ఆ పనులను విడిచి పెట్టలేక, తక్కువ వేతనాలకే పనులు చేస్తు జీవితం వెళ్లదీస్తున్నారు. చాలా మంది ఇక్కడ సరైన జీవనోపాధి అవకాశాలు లేక కుటుంబాలను ఇక్కడే విడిచిపెట్టి, హైదరాబాద్, బెంగుళూరు, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు వలస కూలీలుగా వెళ్తున్నారు. ఏళ్ల తరబడి కొబ్బరి కార్మికులుగా తమ జీవనం వెళ్లదీస్తున్న వారికి సైతం యజమాన్యాలు సరైన వేతనాలు చెల్లించక, పనులు చేసే చోట కనీస సౌకర్యాలు కల్పించక పోతుండటంతో కొబ్బరి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొబ్బరి కార్మికుల్లో ఉన్న నిరక్ష్యరాస్యత, అవగాహనా లేమి కారణంగా ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, కార్మిక చట్టాల ద్వారా సంక్రమించే హక్కులు అందకుండా పోతున్నాయనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. కార్మికుల్లో కార్మిక చట్టాలపై అవగాహన కల్పించాల్సిన సంబంధిత అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తమ హక్కుల సాధన కోసం స్థానిక కొబ్బరి కార్మికులు యూనియన్‌గా ఏర్పడి తమ పోరాటం కొనసాగిస్తున్నారు. ఏళ్ల తరబడి పోరాటాలు సాగిస్తున్నా ఆశించిన హక్కుల సాధనలో పూర్తిస్థాయిలో విజయవంతం కాలేకపోతున్నామని, దీనికి పాలకులు, అధికారులు ఉదాశీనత కూడా కారణమని కార్మిక సంఘ నాయకులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా యాజమాన్యాలు స్పందించి తమకు చెల్లించాల్సిన న్యాయమైన వేతనాలను చెల్లించడమే కాకుండా ప్రమాద బీమా, ఆరోగ్య బీమా సదుపాయాలను, ఇతర సౌకర్యాలను కల్పించాలని వారంతా కోరుతున్నారు. అప్పటి వరకు తాము పోరుబాట విడిచే లేదంటూ స్పష్టం చేస్తున్నారు.


ఎండలో కొబ్బరికాయలు తీత చేస్తున్న కొబ్బరి కార్మికులు

### అంతంతమాత్రంగా సౌకర్యాల కల్పన

కంచిలి మండల కేంద్రంలో పనిచేసే కొబ్బరి కార్మికులకు పనిచేసే

### అంతంతమాత్రంగా కనీస సౌకర్యాలు

చోట కల్పిస్తున్న సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. ఎండ నుంచి రక్షణకు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న తడకలు తప్ప విశ్రాంతికి సైతం శాశ్వత ఏర్పాట్లు లేవు. కొబ్బరి కార్మికులు పని చేసే కొబ్బరి బడ్డీల వద్ద యజమాన్యం ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొబ్బరి కాయలు పీచు తీసే ప్రదేశాల వద్ద ఎటువంటి షెడ్లు నిర్మించకపోవడంతో ఎండలోనే కాయలు వలుస్తున్నారు. మహిళా కార్మికులు పనిచేసే చోట మరుగుదొడ్ల సదుపాయం గానీ, తాగునీటి సదుపాయాలు గానీ లేవు. ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే కార్మికులకు ప్రథమ చికిత్స జరిపేందుకు సైతం అందుబాటులో ఎక్కడా ప్రథమ చికిత్స పెట్టెలను ఏర్పాటు చేయలేదు. దీంతో ఎండైనా, వానైనా పని చేస్తు, చట్టం కల్పిస్తున్న తమ హక్కులను సైతం పొందలేని దుర్భర పరిస్థితుల్లో కొబ్బరి కార్మికులు కొట్టుమిట్టాడుతున్నారు.

### చట్టాల అమలు కాగితాల్లోనే...

కార్మికులు సాధించుకున్న హక్కులు వారికి పొందేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. కాని కంచిలి పరిధిలో పని చేస్తున్న కొబ్బరి కార్మికులకు హక్కులన్నీ కాగితాలకే పరిమితమౌతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. పనిచేసే చోట సౌకర్యాలు కల్పించకపోవడమే కాకుండా ఏదైనా ప్రమాదం జరిగి కార్మికుడికి గాయాలైనా, ప్రాణం పోయినా చట్టప్రకారం చెల్లించాల్సిన లావాదేవీలు సదరు యాజమాన్యాలు చెల్లించడంలో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది. రోజుకి 8 గంటలు మాత్రమే పని చేయాల్సి ఉన్నప్పటికీ 10 గంటలకుపైగా పనులు చేయాల్సి వస్తుందని పలువురు కార్మికులు వాపోతున్నారు. మహిళా కార్మికులు సైతం కార్మిక చట్టాలు తమకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలకు దూరంగానే ఉండిపోతున్నారు. చట్టాలను కఠినంగా అమలు చేసేలా పర్యవేక్షించాలిసిన అధికారులు సైతం నామమాత్రపు తనిఖీలు చేస్తు యాజమాన్యాలకే కొమ్ముకాస్తుండటంతో కార్మికుల పరిస్థితులు దుర్భరంగానే మిగులుతున్నాయి.

# సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

**ప్రజాశక్తి - జి.సిగడాం**

ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి మీసాల సత్యవతి ఆధ్వర్యాన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. జెడ్‌పిటిసి కాయల రమణ, ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ మాట్లాడుతూ మండలంలోని ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి పాటు పడాలని కోరారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని మండలంలో అన్ని గ్రామాలకూ తాగునీరు సరఫరా చేయాలని నీటిపారుదల శాఖ ఎఇ భాగ్యలక్ష్మిని కోరారు. విద్యుత్ ఎఇ జి.తిరుపతిరావు మాట్లాడుతూ మండలంలో విద్యుత్ సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. వ్యవసాయాధికారి శారద మాట్లాడుతూ మండలంలో దాదాపు 70 శాతం వరకు రైతుల ఇకెవైసి పూర్తి చేశామన్నారు.


అధికారులను ప్రశ్నిస్తున్న మదుపాం సర్పంచ్ అప్పలనాయుడు

ఎంఇఒ రవి మాట్లాడుతూ మండంలోని పాఠశాలల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. సమావేశానికి రోడ్ ట్రాన్స్‌పోర్టు పెనసాం వంతెన పూర్తయిందని, గెడ్డ కంచరాం, పలు ప్రాంతాలకు బస్సు సదుపాయం కల్పించాలని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు కార్పొరేషన్ విభాగం నుంచి హాజరైన అధికారి కృష్ణను కోరారు. దరఖాస్తు చేసుకుంటే సదుపాయం కల్పిస్తామని అధికారి బదులిచ్చారు. ఐసిడిఎస్ అధికారి రజనీదుర్గ మాట్లాడుతూ నక్కపేట, మంగంపాలంలో కొత్త అంగన్వాడీ పోస్ట్‌లకు ఈ నెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డిటి నిర్మల మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరగడానికి, భూ రీ సర్వేకు అందరూ సహకరించాలి అని కోరారు. కార్యక్రమంలో మదుపాం సర్పంచ్ బోగాది అప్పలనాయుడు అధికారులందరిని వారివారి విభాగాల్లో సమస్యలపై ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపిపి మీసాల సత్యవతి, జెడ్‌పిటిసి కాయల రమణ, మండల ప్రత్యేక ఆహ్వానితులు మీసాల రమణ, వైస్ ఎంపిపి తోడేటి వెంకటరమణ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసరావు, డిప్యూటీ తహశీల్దార్ నిర్మల, ఎఒ శారద, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నాయుడు, ఎపిఎం రెడ్డి రామకృష్ణ, ఎపిఒ సత్యనారాయణ, వెటర్నరీ డాక్టర్ సునీల్, డాక్టర్ శ్రీహరిత, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.


శ్రీముఖలింగంలో ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు

## శ్రీముఖలింగంలో బారికేడ్ల ఏర్పాట్లు

**ప్రజాశక్తి - జలుమూరు**


పరిసరాలను జెసిబితో శుభ్రం చేయిస్తున్న సిబ్బంది

మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకూ శ్రీముఖలింగంలో జరగనున్న ఉత్సవాలకు యాత్రికుల సౌకర్యార్థం బారికేడ్లు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ పంచిరెడ్డి లింగమూర్తి ఆదివారం తెలిపారు. ముందుగా ఆలయం రెండు వైపులా మాడవీధుల గుండా బారికేడ్లు కట్టి అనంతరం ఆలయం ముందు, వెనుక, లోపలి భాగంలో అవసరం మేరకు బారికేడ్లు కట్టనున్నామన్నారు. ఇంకా అదనంగా అరసవల్లి నుంచి బారికేడ్లు తేనున్నామన్నారు. శ్రీముఖలింగానికి సంబంధించినవి 175 వరకూ బారికేడ్లు ఐరన్ వి ఉండగా మిగిలినవి ఇతర ఆలయాల నుంచి తేనున్నామన్నారు. సామాన్యులు కూడా స్వామి దర్శినం కలిగించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయంలో ఆరు సిసి కెమోరాలు ఉండగా అదనంగా సిసి కెమెరాలు కూడా అందుబాటులోకి తేనున్నామన్నారు. ఆలయ పరిసరాలు పరిశుభ్రత పనులు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

## జనసేన క్రియాశీలక సభ్యునికి ఆర్థికసాయం

**ప్రజాశక్తి - బూర్జ**

మండలంలోని మదనాపురం గ్రామానికి చెందిన సింహాద్రి మధుసూదనరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని, పేడాడ రామ్మోహనరావు ఆధ్వర్యంలో క్రియాశీలక వాలంటరీ అనంత్ సమక్షంలో 50 వేల చెక్కును ఆదివారం అందించారు. కార్యక్రమంలో ఎంపిటిసి అంపిలి విక్రమ్, పాత్రుని పాపారావు, కొల్ల జయరాం, మౌళి, రాంబాబు, అప్పలరాజు, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందిస్తున్న జనసేన నాయకులు

## మురపాకలో 'చదవడం మాకిష్టం'

**ప్రజాశక్తి - లావేరు**

మండలంలోని మురపాక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. వచ్చిన ప్రతి విద్యార్థీ కథలు చెప్పడంతో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు జి.షణ్ముఖరావు పాల్గొన్నారు. అలాగే లావేరు శాఖా గ్రంథాలయంలోనూ చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. బాగా చదివిన ముగ్గురు విద్యార్థులకు గ్రంథాలయం తరుపున బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు జి.గడ్డియ్య పాల్గొన్నారు.


విద్యార్థులతో గ్రంథాలయాధికారి

## 11వ జాతీయ మహాసభను జయప్రదం చేయాలి

**ప్రజాశక్తి - పలాస**

ఈ నెల 15న పాట్నాలో జరిగే సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ 11వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. మండలంలోని బొడ్డపాడు గ్రామంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ సీనియర్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు, జిల్లా సెక్రటరీ తామాడ సన్యాసిరావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌ను సంప్రదించకుండానే ప్రజా జీవితాలను ప్రభావితం చేసే అనేక నిర్ణయాలను తీసుకోవడం దారుణమన్నారు. తద్వారా ప్రజల ప్రజాస్వామ్య హక్కులను కాలరాసి దేశాన్ని కార్పొరేట్లకు దారాదత్తం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందరికీ విద్యా, వైద్యం కల్పించాలని, స్వచ్ఛమైన తాగునీరు, గాలి, పరిశుభ్రత, పక్కా ఇల్లు అందరికీ కల్పించాలని కోరారు. పనిచేసే వారందరికీ 200 రోజులు ఉపాధి పని, రూ.700 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. యువకులకు ఉద్యోగ, ఉపాధిని కల్పించాలని, ప్రతి కుటుంబానికీ గ్యాస్, 200 యూనిట్లు విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వాలని కోరారు. రైల్వేలు, జాతీయ రహదారులు, కోర్టులు, గనులు, స్టీల్ ప్లాంట్లు, ఎల్ఐసి ప్రైవేటీకరణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి, మద్దతు దరను కల్పించాలని కోరారు. కార్పొరేట్లపై పన్ను విధించి చిరు వ్యాపారులపై జిఎస్‌టిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మద్దిల రామారావు, దుష్యంత్, నాగేశ్వరరావు, కామేశ్వరరావు, అప్పారావు, శ్రీను, కైలాస్, అప్పయ్య, పాపయ్య, మహిళా సంఘం నాయకులు దాలమ్మ జగదీష్, రామకృష్ణ, మల్లేశ్వరరావు, చిన్న, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశ్వరరావు

## శ్రీముఖలింగంలో కిరణ స్పర్శ

**ప్రజాశక్తి - జలుమూరు**

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరుని క్షేత్రపాలకుడు శ్రీ మహావిష్ణువు పాదాలకు ఆదివారం ఉదయం సూర్యకిరణాలు తాకాయి. సుమారు రెండు నిమిషాల పాటు సూర్య కిరణాలు స్వామివారి పాదాలు స్పృజించాయి. ఆ సమయంలో యాత్రికులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ దృశ్యాన్ని యాత్రికులు చూసి తరించారు. ఇలా వారం రోజులు పాటు విష్ణువు పాదాలు నుంచి శిరస్సు వరకూ సూర్య కిరణాలు ప్రతి రోజూ తాకుతాయని అర్చకులు చెబుతున్నారు.


విష్ణుమూర్తి విగ్రహ పాదాలను తాకుతున్న సూర్యకిరణాలు

# దుమ్ము రేపుతున్నాయి

**ప్రజాశక్తి - మెళియాపుట్టి**

నిత్యం రాకపోకలు సాగిస్తున్న వాహనదారులకు, ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. రహదారులు అభివృద్ధి లేకపోవడంతో రాళ్లు తేలిన రహదారిపై వాహనదారులు ప్రయాణం సాగిస్తున్నారు. ముందు ఓ వాహనం వెళ్తే ఆ వెనుక వచ్చే దుమ్ము, ధూళితో ప్రయాణికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి గుండా ప్రయాణాలు సాగిస్తూ వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు.

మండలంలోని గంగరాజుపురం, పట్టుపురం మధ్య మూడు కిలోమీటర్ల మేర రహదారి అధ్వానంగా తయారైంది. రహదారి అభివృద్ధి పనుల పేర రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగించి, గోతులను ప్రొక్లెయిన్‌తో చదును చేసి, కొన్ని చోట్ల మెటల్ క్రషర్ బుగ్గి వేసి వదిలేశారు. దీనితో వాహనాల రాకపోకల సమయంలో ధూళి రేగుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము, ధూళి పీల్చడంతో కొంతమంది ప్రయాణికులు అనారోగ్యం పాలవుతున్నారు. ఈ రహదారిలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో నిత్యం రహదారి ధూళిమయం అవుతోంది. దీనితో ప్రయాణికులు ఈ రహదారిలో ప్రయాణించేందుకు భయపడుతున్నారు. రోజులు గడుస్తున్న రహదారి అభివృద్ధి లేకపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మెళియాపుట్టి, పాతపట్నం, ఆల్ ఆంధ్ర రోడ్డు ఎక్కడికక్కడే గుంతలమయం అయింది. మారుమూల ప్రాంతమైన నేలబొంతు, భీంపురం మధ్య బిటి రోడ్డు అధ్వానంగా మారింది. నాలుగేళ్లుగా ఈ రహదారి నిండా రాళ్లు తేలడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి అభివృద్ధి లేని కారణంగా టెక్కలి నుండి వీరన్నపేట వరకు తిరిగే ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా నిలిపివేశారు. రహదారి రూపు కోల్పోయి కాలిబాటగా తయారైంది. మెళియాపుట్టి, నేలబొంతు రోడ్డు కూడా రూపు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. రహదారుల అభివృద్ధికి ఆర్‌అండ్‌బి అధికారులు దృష్టి సారించాలని ఈ ప్రాంతపు ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.


దుమ్ము రేపుతున్న పట్టుపురం-మందస రోడ్డు

### రోడ్డు ఎప్పుడు వేస్తారు

రోడ్డును తక్షణమే వేయాలి. లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రయాణికుల అవసరాల రీత్యా తక్షనం రోడ్డు వేయాలి. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి.

**- జడ్డాడ కృష్ణ, చాపర**

### రాకపోకలకు అవస్థలు

పట్టుపురం, మందస రోడ్డు వాహనాల రాకపోకలతో ధూళి ఎగిసిపడుతోంది. ఫలితంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడాల్సి వస్తోంది. తక్షణమే రోడ్డును వేయాలి.

**- వంజంగి రమేష్, పెద్ద లక్ష్మీపురం**

## అంతుచిక్కని వ్యాధితో ఆవులు మృతి

**ప్రజాశక్తి - పొందూరు**


మృతిచెందిన ఆవులను గోతిలో పూడ్చుతున్న రైతు

మండలంలోని రెడ్డిపేటలో ఆదివారం సాయంత్రం అంతుచిక్కని వ్యాధితో రెండు ఆవులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన పాడి రైతు కొంచాడ మహేష్‌కు చెందిన ఆవులు సాయంత్రం వరకు ఎంతో ఆరోగ్యంగా ఉన్నాయి. ఒక్కసారిగా ఒకదాని తరువాత ఒకటి నడుము విరుస్తూ కిందపడి కొట్టుకుంటూ ప్రాణాలు విడిచాయి. రెండు ఆవులు సుమారు రూ.80 వేలు వరకు విలువ చేస్తాయి. ఒక్కసారిగా అంతుచిక్కని వ్యాధితో ఆవులు మృతి చెందడంతో గ్రామంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే గ్రామంలో పశు వైద్యశాఖాధికారులు పర్యటించి చర్యలు తీసుకోవాలని, మృతి చెందిన ఆవులకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. సర్పంచ్ ప్రతినిధి కంబాపు సూర్యారావు ఆవులు మృతి చెందిన విషయాన్ని పొందూరు పశువైద్యశాఖ ఎడి బాలకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు.